క్లుప్తంగా

పరీక్ష ప్యాడ్‌లు అందజేత

బేల: మండలంలోని చంపెల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలోని 27 మంది పదో తరగతి విద్యార్థులకు ఆదివారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను సర్పంచ్ కొరంగే జంగ్‌షా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్. భోజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ.. గత 21 వారాలుగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం తమవంతుగా రోగుల సహాయకులకు, పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు, భూరె సురేశ్, రామకృష్ణ, విశాల్, మోతిలాల్, గంభీర్, ప్రశాంత్ పాల్గొన్నారు. సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 106 వారాలుగా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో అన్నదాన చేశారు. కార్యక్రమంలో శేఖర్, అమృత్‌రావు పటేల్, భీంరావు పటేల్, మజీద్, మహేందర్, సలీమ్, సుభాష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనం ఎదుట చలి వేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంబడి సురేశ్, నారాయణ రెడ్డి, అశోక్, హన్మంతు రెడ్డి పాల్గొన్నారు.

అన్నివిధాలుగా అండగా ఉంటాం

ఆదిలాబాద్‌టౌన్: విశ్వబ్రాహ్మణ కులస్తులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రహ్మ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రవి ఎమ్మెల్యేను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

కార్యవర్గం ఎన్నిక

బజార్‌హత్నూర్: మండల ఆర్యవైశ్య నూతన కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కత్తూరి సంపత్ కుమార్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా పద్మ నందుకుమార్, అధ్యక్షుడిగా ముత్యంవార్ నాగనాథ్, ప్రధాన కార్యదర్శి అయితు నందుకుమార్, కార్యవర్గ సభ్యులుగా ఇందూరి నరేశ్, అనంతుల కృష్ణమూర్తి, పొలవార్ దిలీప్, ప్రమోద్, గిరిష్, సలహాదారులు బాలాజీ, సురేశ్, గణేష్, రాజేశ్వర్, విశ్వనాథ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

హనుమాన్ దీక్ష సేవ సమితి కార్యవర్గం

బోథ్: మండల కేంద్రంలో హనుమాన్ దీక్ష సేవా సమితి కార్యవర్గాన్ని ఆదివాకం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సేరె సందీప్, అధ్యక్షుడిగా జవాజీ రాజు, ఉపాధ్యక్షుడిగా ముత్యం, వినోద్, శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా నితీష్ గౌడ్, సేరె సంతోశ్, ఆరె రమేశ్, కోశాధికారిగా పూంద్రు రాకేశ్‌రెడ్డి, సలహాదారులుగా క్రాంతి, భరత్, సాయిని గణేశ్, ఓస వినయ్, సాయిని వంశీ లను ఎన్నుకున్నారు.

నియామకం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), భజరంగ్ దళ్ కమిటీని ఆదివారం నియమించినట్లు విశ్వ హిందూ పరిషత్ నాయకుడు నారాయణ తెలిపారు. వీహెచ్‌పీ అధ్యక్షుడిగా పందెన రాజేశ్, ఉపాధ్యక్షుడిగా రొడ్డ గంగన్న, గజ్జల చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా చీర్ల శ్రీనివాస్, కార్యదర్శులుగా అట్ల సతీష్‌రెడ్డి, రమేశ్, భజరంగ్ దళ్ అధ్యక్షుడిగా అట్ల రాకేశ్ రెడ్డి, సహ ప్రముఖ్‌లుగా సంజీవ్, మణికంఠలను నియమించినట్లు పేర్కొన్నారు.

ఫోన్ అందజేత

ఆదిలాబాద్‌రూరల్: ఐఎంఈఐ నంబర్ ఆధారంగా ట్రాక్ చేసి రూ. 26వేల విలువ గల ఫోన్‌ను పోలీసులు బాధితుడికి అందజేశారు. వివరాల్లోకి వెళితే.. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న న్యాయవాది వినోద్ రెడ్డి కాలనీలో వాకింగ్ చేస్తున్న క్రమంలో మార్చి 16న ఫోన్ ఎక్కడో పడిపోయింది. దీంతో ఆయన మీసేవా ద్వారా మావల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు వినోద్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగా ఫోన్ కనిపెట్టారు. ఫోన్‌ను మావల ఎస్సై విష్ణువర్ధన్ ఆదివారం వినోద్‌రెడ్డికి పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు.

మాలలంతా ఏకతాటిపైకి రావాలి

జైనథ్: మాలలంతా ఏకతాటిపై వచ్చి, తమ హక్కుల సాధన కోసం పోరాడాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో సంఘ భవన నిర్మాణం కోసం సేకరించిన రూ.50వేల విరాళంను అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బాబన్న, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ ఉపాధి



రోడ్డు పక్కన పుచ్చకాయల దుకాణం

- పుచ్చకాయ, దోసకాయలకు గిరాకీ
- అందుబాటు ధరలో లభ్యం
- వడదెబ్బ తగలకుండా ఉపశమనం

ఇచ్చోడ: సీజనల్‌లో లభించే పండ్లను తింటే ఆరోగ్యంతో పాటు శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. అనారోగ్యం బారి పడిన వారికి పండ్లు టానిక్‌లా పని చేస్తాయి. ప్రస్తుతం మార్కెట్లో సీజనల్ పండ్లకు డిమాండ్ పెరిగింది. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ధర అందుబాటులో ఉండేసరికి పండ్ల మార్కెట్ కిటకిటలాడుతోంది. ప్రతీరోజు పండ్లు అమ్ముతూ.. చిరువ్యాపారులు ఉపాధి పొందుతున్నారు.

దోస, పుచ్చకాయలకు డిమాండ్..

వేసవిలో చల్లదనాన్ని ఇచ్చే దోస, పుచ్చకాయలకు గిరాకీ పెరిగింది. ఇవి మార్కెట్లో తక్కువ ధరకు లభిస్తున్నాయి. పట్టణాల్లో పలుకూడళ్ల వద్ద తోపుడు బండ్లపై దోసకాయలు విక్రయిస్తుంటారు. కిలో ధర రూ. 50 నుంచి రూ. 60 అమ్ముతున్నారు. అలాగే రోడ్డు పక్కన పుచ్చకాయ విక్రయ కేంద్రాలు వెలిశాయి. పుచ్చకాయలు కిలోకు రూ. 20 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తున్నారు. పుచ్చకాయలను చిన్న సైజుల్లో కట్‌చేసి చల్లని ఐస్‌పై పెట్టి అమ్ముతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు దోస, పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్నారు.



దోసకాయలు అమ్ముతున్న చిరువ్యాపారి

పండ్లతో ఆరోగ్యం



సీజనల్ పండ్లు తినడం మంచి అలవాటు. అన్ని కాలంలో లభించే పండ్లను మోతాదులో తీసుకోవాలి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరూ పండ్లు తినడం అలవాటు చేసుకోవాలి. దోస, పుచ్చకాయలను తినడం వల్ల వడ దెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు.

– రాథోడ్ రవి, చిన్న పిల్లల వైద్య నిపుణులు

రక్తహీనత నుంచి కాపాడుతుంది



స్త్రీలలో ఎక్కువగా రక్తహీనత ఏర్పాడుతుంది. దీంతో తరుచుగా అనారోగ్యానికి గురవుతుంటారు. రక్తహీనత నుంచి కాపాడుకోవడానికి పండ్లు చాలా ఉపయోగపడుతాయి. యాపిల్, దానిమ్మ, బత్తాయి పండ్లు తీసుకోవడం ఉత్తమం.

– జాదవ్ హిమబిందు, స్త్రీ వైద్య నిపుణులు

వేసవిలో లభించే పండ్లు..

ఖర్బూజ, అనాస (పైనాపిల్), బొప్పాయి, దానిమ్మ, ఖర్జూరం, నేరేడు, పుచ్చకాయ, సపోట, జామ, ద్రాక్ష, మామిడి, నారింజ, నిమ్మతాటి పండు, అంజీర్, తాటి మంజలు, స్ట్రాబెర్రి, కివి పండ్లు ప్రస్తుతం మార్కెట్లు లభిస్తున్నాయి. కివీ పండులో అత్యధికంగా పోషకాలు ఉంటాయి. దీనిని వండర్ ఫ్రూట్ అని కూడా పిలుస్తారు. దాదాపుగా 27 రకాల పండ్లలో లభించే పోషకాలు ఒక్క కివీ ఫ్రూట్‌లోనే లభిస్తాయి. నారింజ, బత్తాయి, వంటి పండ్ల కంటే విటమిన్ (సి) మూడు రెట్లు అధికంగా ఉంటుంది. యాపిల్ కంటే ఎక్కువ పోషకాలు ఉంటాయి. విటమిన్(సి), విటమిన్ (ఇ), పోషకాలు ఉంటాయి. ఈపండు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



గుడిహత్నూర్: మండలంలోని తోషం గిరిజన ఆశ్రమ పాఠశాల గేటుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై వాలి ప్రమాదకరంగా మారాయి. ఈదురు గాలులకు చెట్టు కొమ్మలు విరిగితే విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – సంబంధిత అధికారి: బాలాజీ, లైన్‌మెన్, ఫోన్: 94933 13740

గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తలమడుగు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించడం జరిగిందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని రత్నాపూర్ గ్రామానికి రూ.4 కోట్లతో మంజూరైన బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాలకు రోడ్లు నిర్మిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచన విధానం గొప్పదని, దేశాన్ని పాలిస్తే కచ్చితంగా దేశం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేశ్, అధికార ప్రతినిధి మొట్టే కిరణ్‌కుమార్, సర్పంచ్ రాంబాయి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

ఇచ్చోడ: కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ నిలుస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండలంలోని ధరంపూరి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కిర్వలే ఉత్తమ్ ప్రమాదవశాత్తు కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ. 2 లక్షల చెక్కును ఆదివారం ఆదిలాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో మృతుడి భార్య శివానందబాయికి అందచేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

రానున్న రోజుల్లో దేశమంతా తెలంగాణ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: రానున్న రోజుల్లో దేశమంతా తెలంగాణ పథకాలు అమలు చేయాలనే గొప్ప సంకల్పంతో సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేస్తున్నట్లు ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండలంలోని పిప్పర్‌వాడ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాలనలో రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్ వంటి ఎన్నో అద్భుతమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధి యావత్ దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మనోహర్, ఎంపీపీ గోవర్ధన్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు రమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ లింగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, పిప్పర్‌వాడ సర్పంచ్ సంతోష్ రెడ్డి, వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని జిల్లా పరిషత్, ఆశ్రమ బాలికల పాఠశాల, కేస్లాపూర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో పది పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నెంబర్లు వేశారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో 196 మంది, జిల్లా పరిషత్ పాఠశాలలో 221 మంది, కేస్లాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో 22 4 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఎంఈవో నారాయణ తెలిపారు.

నేరడిగొండ: సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానునున్నట్లు ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించామన్నారు.

నార్నూర్: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రాపల్లి ఆశన్న అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో 185 మంది, జెడ్పీ ఉన్నత పాఠశాల తాడిహత్నూర్‌లో 176, గాదిగూడ మండలంలోని ఆశ్రమ బాలురు పాఠశాలలో 107 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

- రిమ్స్‌కు తరలింపు
- భారీ వాహనాల రాకపోకలతో గ్రామస్తుల ఆగ్రహం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి గ్రామంలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అర్లి (బి) గ్రామానికి చెందిన నైతం రమేశ్ దంపతులు పనులు ముగించుకొని ఆదిలాబాద్ నుంచి లాండసాంగ్వి గ్రామం మీదుగా అర్లి (బి) గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. ఇదే క్రమంలో మార్గమధ్యలో లాండసాంగ్వి గ్రామంలో అర్లి వైపు నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రమేశ్ భార్య వైష్ణవికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్థానికులు 108కు సమాచారం ఇచ్చి రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

నిలిచి పోయిన వాహనాలు

ఇటీవల జైనథ్ మండలం తర్నం వంతెన కుంగిపోవడంతో లాండసాంగ్వి గ్రామం మీదుగా భారీ వాహనాలు రాకపోకలు కొనసాగుతున్నాయి. సింగిల్ రోడ్డు కావడం, రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడడంతో తరుచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం లాండసాంగ్వి గ్రామంలో రోడ్డు ప్రమాదం జరగడంతో ఆ రోడ్డు గుండా వెళ్లే గ్రామాల ప్రజలు లారీని అడ్డుకున్నారు. భారీ వాహనాలను దారి మళ్లించాలని రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



గాయపడిన వైష్ణవి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాథోడ్ చారులత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పలువురు మహిళలు, యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. మిషన్ భగీరథ పథకం అమలు చేసినా.. ఒక్క ఇంటికి కూడా నీరు రావడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పుర్క బాపురావ్, సోమసే వెంకట్‌రావ్, సోమోరే నాగోరావ్, లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు మంజుల రాథోడ్, రాధాబాయి, కోసుబాయి పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చారులత

- అకౌంట్లో జమ కానీ శనగ పంట డబ్బులు
- ఆర్థికంగా ఇక్కట్లు

రైతులకు తప్పని ఎదురుచూపు



బేల సబ్‌మార్కెట్ యార్డులో శనగ కొనుగోళ్లు

బేల: మార్కెట్ యార్డుల్లో అమ్మిన శనగ డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. గత నెల 3 నుంచి జైనథ్ మార్కెట్ పరిధిలో శనగ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఒక క్వింటాలుకు రూ.5,337 మద్దతు ధరతో కొనుగోళ్లు ప్రారంభమై, నెల రోజులు గడుస్తున్నా. ఇంకా రైతుల అకౌంట్లో డబ్బులు రాలేదు. దీంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

కొనసాగుతున్న కొనుగోళ్లు..

జైనథ్ మార్కెట్ యార్డు, బేల సబ్ మార్కెట్‌యార్డుల్లో మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో గత నెల 3 నుంచి శనగ కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వాతావరణ మార్పులతో కొనుగోళ్లు నిలిచాయి. మళ్లీ ఇటీవల నుంచి కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయి. ఇప్పటిదాకా జైనథ్, బేల మండలాలకు చెందిన మొత్తం 2,850 మంది రైతుల నుంచి శనగ కొనుగోళ్లు పూర్తయ్యాయి. జైనథ్ యార్డులో 48,200 క్వింటాళ్లు, బేలయార్డులో 19,440 క్వింటాళ్ల శనగ కొనుగోళ్లు పూర్తిచేశారు. ఈ నెలాఖరు వరకు గ్రామాల షెడ్యూల్ ప్రకారం కొనుగోళ్లు పూర్తికానున్నాయి.

ఇంకా రానీ డబ్బులు..

కొనుగోళ్లు ప్రారంభమై నెల రోజులు పూర్తవుతున్నా.. రైతులకు ఎటువంటి డబ్బులు రాలేదు. నిబంధనల ప్రకారం పంట అమ్మిన రైతులకు వారం నుంచి 15 రోజుల లోపు డబ్బులు చెల్లించాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. మరోవైపు ఆర్థికక పరిస్థితులకు అనుగుణంగా మద్దతు ధర కంటే తక్కువ ధరకు పలువురు రైతులు దళారులకు అమ్ముకున్నారు. అధికారులు స్పందించి శనగ డబ్బులు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

డబ్బులు చెల్లించాలి



గత నెల 12న బేల సబ్ మార్కెట్ యార్డులో శనగ పంట అమ్మినాను. 20రోజులకు పైబడి అవుతున్నా.. ఇంకా డబ్బులు రాలేదు. ఎప్పుడు వస్తాయో చెబుతలేరు. ప్రభుత్వం, అఫీసర్లు స్పందించి శనగలు అమ్మిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలి.

– రమేశ్, రైతు చప్రాల

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం



రైతులు అమ్మిన పంటలకు వెంటనే డబ్బులు అందిస్తే ప్రయోజనం ఉంటుంది. గతంలో కరోనా కంటే ముందు శనగలు మార్కెట్‌యార్డులో అమ్మిన వారం, పది రోజుల్లో డబ్బులు వచ్చేవి. కానీ ఇప్పుడు రావడం లేదు. ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– ప్రదీప్, రైతు చప్రాల

పోషకాహారం తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని వార్డ్ నం.15 కౌన్సిలర్ సంగీత అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం సుందరయ్యనగర్- 1 అంగన్‌వాడీ టీచర్ రాధ ఆధ్వర్యంలో యువజన సంఘాల సభ్యులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిరు ధాన్యాల్లో అనేక పోషకాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా, సామాజిక కార్యకర్త రాజు, స్వాగత్, నరేశ్, విఘ్నేష్, సభ్యులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సంగీత

ప్రతిఒక్కరూ గోమాతను పూజించాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రతిఒక్కరూ గోమాతను పూజించాలని శ్రీరామచంద్రా గోపాల కృష్ణ మఠం పీఠాధిపతి యోగనందా సరస్వతి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోశాలను ఆదివారం మావల మండలంలోని దుర్గామాత ఆలయం పూజారి కిషన్ మహరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోమాతకు పూజలు చేసి హారతి ఇచ్చారు. దేవతలందరినీ పూజించాలంటే వారు కొలువుండే గోమాతను పూజించాలన్నారు. ప్రభుత్వం ఐదేకరాలలో గోశాల ఏర్పాటు చేయడం, నిర్వహణ కోసం గోమాత సేవా ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారిని గోమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు, మంచికట్ల ఆశమ్మ, బీజేపీ రాష్ట్ర నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి, గోమాత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు సురేశ్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గేడం మాధవ్, చిందం దేవిదాస్ పాల్గొన్నారు.



నాయకులను సన్మానిస్తున్న సభ్యులు

6న హనుమాన్ చాలీసా పారాయణం

బోథ్: ఈనెల 6న పెద్దార్ల గుట్ట హనుమాన్ ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు వేద పండితులు నెమలికొండ సంతోశ్‌కుమార్ శర్మ తెలిపారు. ఆదివారం హనుమాన్ దీక్షపరులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్, హనుమాన్ దీక్ష పరులు రాకేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

5న హనుమాన్ సింధూర పూజ

తాంసి: మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 5న బుధవారం హనుమాన్ సింధూర పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు వామన్ రెడ్డి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు హనుమాన్ సింధూర పూజ ప్రారంభమౌతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.